# దొంగయితే బాగుణ్ణు

అమావాస్య ...రాత్రి రెండుగంటల సమయం. దానికి తోడుగా అప్పుడే కరెంటు పోవడం వల్ల కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి పట్టణమంతా అలుముకుని ఉంది.

దూరంగా కుక్కలు మొరుగుతున్న శబ్దాలు - అప్పుడప్పుడు ఊళ్ళో ఎక్కడో పోలీసు జీపు సంచరిస్తున్నట్లు సైరను వినిపిస్తోంది.

రైల్వే ఫీడరు రోడ్‌లో అంత చీకటిలోనూ - వడివడిగా, భయం భయంగా అడుగులు వేస్తున్నాడు రామలింగం. చలి బాగా ముదిరి ఉండటం వల్ల ఓ చేత్తో సూట్‌కేస్ గట్టిగా పట్టుకుని, మరోచేతిని చలికి తట్టుకోడానికేమో నడుం వెనుక అదిమిపట్టి నడుస్తున్నాడు. మఫ్లర్ లేనందువల్ల చలికి మొద్దుబారాయి చెవులు.

అందుకే వెంటనే ఆగి సూట్‌కేసుని కింద పెట్టేసి, పేంటు జేబులోంచి కర్చీఫ్ తీసి త్రిభుజాకారం వచ్చేలా ఓ మడతవేసి, చెవులు అణిగిపోయేలా తలకు బిగదీసి నుదుటిపైన ముడివేసుకున్నాడు రామలింగం. జేబులో ఉన్న ఒక సిగరెట్టునీ వెలిగించి గుండెలదాకా పొగనిపీల్చి తృప్తిగా వదిలాడు. భయం, చలీ కొంచెం తగ్గినట్టు ఫీలయి సూట్‌కేసుని తీసుకుని మళ్ళీ చకాచకా అడుగులు వేస్తూ నడక సాగించాడు.

కాలి నడకనయితే మరో అరగంటకి గానీ ఇల్లుచేరుకోలేడు తను. దార్లో ఏ రిక్షానో, ఆటోనో వస్తుందన్న నమ్మకం లేదు. ఎంచేతనంటే శాంతి భద్రతల్ని దృష్టిలో ఉంచుకుని పోలీసుశాఖ వాళ్ళు గత రెండు నెలలుగా రాత్రి పదకొండు గంటల తర్వాత వాహనాలు ఏవీ పట్టణంలో తిరగరాదని ఆజ్ఞలు విధించారు.

'ఇంత రాత్రవుతుందని తెలిసుంటే అసలు బయలుదేరకనే ఉందును కదా!' అనుకుని ఓ గాఢమయిన నిట్టూర్పు విడిచాడు రామలింగం.

అక్కడికీ రామలింగం తల్లి అననే అంది.

"ఈ వేళప్పుడు బయల్దేరకపోతే ఏం? బస్సులు దొరుకుతాయా ఏమన్నానా పొద్దున్నే పోదువుగానిలే!" అని. అయినా అమ్మ మాటల్ని పెడచెవిని పెట్టాడు. తను "ఎంతసేపమ్మా! గంటలో ఊరు చేరుకోనా!" అంటూ బయల్దేరాడు. అతనంత తొందరపడ్డానికి కారణం అతనిది కొత్తకాపురం! అందులోనూ భార్య ఒంటరిగా ఉంటుందేమోనన్న ఫీలింగొకటి అతన్ని సొంత ఊళ్ళో నిలవనివ్వలేదు.

తీరా బస్టాండు చేరుకున్నాక బయల్దేరాల్సిన బస్సు ఏదో రిపేర్ కారణంగా ఆగిపోయింది. ఆ తర్వాత బస్సులు లేవు. అందుకని ఊరి బయటకు చేరుకున్నాడు- ఏదైనా లారీ దొరక్కపోదా అని. ఓ గంటన్నర తర్వాత ఇక్ష్వాకుల కాలంనాటి లారీ ఒకటి వచ్చింది. రామలింగం పరమానందభరితుడై క్యాబిన్‌లోకి ఎక్కి కూచున్నాడు.

లారీ కదిలింది. అతని ఆనందం లారీకి ఇష్టమున్నట్లు లేదు. అందుకే వెంటనే తన విపరీతమైన కంపనాలతో అతన్ని నీరు కార్చింది. కంపరం పుట్టి వెళుతున్న లారీలోంచే దూకేద్దామా అని ఆలోచించి – 'కొత్త కాపురం, ఒంటరి భార్య' వగైరాలు జ్ఞాపకానికి వచ్చి విధిలేక విరమించుకున్నాడు.

ఐదు మైళ్ళ ప్రయాణం చేశాక లారీ టైరు 'డాం'మని పేలింది. డ్రైవరూ, క్లీనర్లూ బీడీలను తాగుతూ ఓరెండు గంటలసేపు స్టెఫినీతో టైరు మార్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ మార్చిన టైరు అంత మంచిది కానందువల్ల గంటకి 10 కిలో మీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణం చేస్తూ రెట్టింపు కంపనాలతో అదరగొట్టేసింది రామలింగాన్ని. ఊరుకు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న బైపాస్ రోడ్డులో రామలింగాన్ని వదిలేసి తన దారిన తను చక్కాపోయింది లారి.

అంతవరకూ ఇల్లూ, ఇల్లాలు మాత్రమే మదిలో మెదులుతున్న రామలింగానికి ఇప్పుడు ఇంటికి చేరడమెట్లా అన్న భయం పట్టుకుంది.

అతనలా భయపడుతున్నాడూ అంటే పిరికివాడని కాదు. దొంగలంటే భయం లేదతనికి – తన దగ్గర ఏమున్నది గనక... ఓ పాత చిన్న సూట్‌కేసూ, అందులో ఓ జతబట్టలూ, చేతికో వాచీ, జేబులో పదిరూపాయలూ...

ఇక దయ్యాలంటే అసలు భయం లేదు అతనికి. ఆదివారం అమావాస్య రోజున అర్ధరాత్రి శ్మశానం నడిబొడ్డులో ఒంటరిగా సంచరిస్తూ జాలీగా కింగ్‌సైజ్ సిగరెట్ కాల్చేసి రాగల మగధీరుడు రామలింగం! ఒక వేళ దయ్యమే ఎదురయితే ఎడమకాలితో తన్నేసి, చెడామడా తిట్టేసి రాగలడతను.

రామలింగం తన చిన్నతనం నుంచి భయం అన్న పదానికి అర్థం తెలీకుండా పెరిగాడు.

దొంగలకీ, దయ్యాలకీ భయపడని రామలింగం భయపడుతోంది ఒక్క పోలీసుల గురించే – అయితే – రామలింగం ఎందుకు భయపడుతున్నాడూ – అంటే దానికి నెలక్రితం జరిగిన ఓ సంఘటనే కారణం!

★ ★ ★

ఆ రోజు రాత్రి సెకండ్ షోకి వెళ్ళాడు రామలింగం – భార్యతో సహా. సినిమా వదిలాక తృప్తిగా ఇంటిదారి పట్టారు. ఏ రిక్షాలోనో ఎక్కేసి ఉంటే సరిపోయేది.

"వెన్నెల రాత్రి కదా! హాయిగా నడిచే వెళ్దామండీ!" అంది అతని భార్య.

సర్లెమ్మని చెట్టాపట్టాలేసుకుని నడుస్తున్నారిద్దరూ, ఓ ఫర్లాంగు దూరం నడిచేటప్పటికి జనసంచారం కరువైపోయింది. అయినా ఇద్దరూ సినిమాలోని జోకుల్ని నెమరేసుకుంటూ హాయిగా నడుస్తున్నారు. ఇంకొక్క ఫర్లాంగు దూరం నడిస్తే ఇల్లు వచ్చేస్తుంది.

సరిగ్గా అప్పుడు – ఎక్కడినుంచి వచ్చిందో పోలీసు జీపు...అందులోంచి ఓ పోలీసు అధికారి దిగాడు.

"ఎక్కడినుంచి వస్తున్నారు?" అడిగాడు పోలీసు అధికారి.

చెప్పాడు రామలింగం.

"అయితే సిన్మాటిక్కెట్టు ముక్కలేవి?"

జేబుల్ని వెదికాడు రామలింగం. టిక్కెట్టు ముక్కలు దొరకలేదు. తను థియేటర్ బయటికి వచ్చాక సిగరెట్టు పేకెట్టు జేబులోంచి తీసుకున్నప్పుడేమో అవి పడిపోయి నట్టున్నాయి.

అమాటే చెప్పాడు రామలింగం.

నమ్మలేదు పోలీసు అధికారి.

"అసలు మీరిద్దరూ ఎవరు? ఇంతరాత్రి వేళ ఎక్కడికెళ్తున్నారు....నిజం చెప్పండి!" అంటూ గర్జించినట్టు అడిగాడు పోలీసు అఫీసరు.

"భార్యభర్తలం సార్.... ఇంటికెళ్తున్నాం"

"ఎలా నమ్మమంటావ్?"

"అదేమిటి సార్ అలాగంటారు...అదిగో నా భార్య మెడలో మంగళసూత్రం!"

"నోర్ముయ్! భాంచోత్! ఆ మంగళసూత్రం మీద నీపేరు రాసి వుంటుందా! ముందు పదండి స్టేషనుకు, ఆ తర్వాత మీసంగతి తేల్చుతాను.మీరు భార్యాభర్తలైతే సినిమా వదుల్తానే ఏ రిక్షాలోనో, ఆటోలోనో ఇల్లు చేరుకుంటారు. ఇల్లా అర్ధరాత్రయినా, అపరాత్రయినా చెట్టాపట్టాలేసుకుని షికార్లు కొడతారా!" అంటూనే జీపులో ఇద్దర్నీ ఎక్కించుకొని స్టేషనకు తీసుకెళ్ళాడు. రాత్రంతా పోలీసుల యక్షప్రశ్నలతోనూ, అవమాన భారంతోనూ జాగారం చేశాక ఏదో అపారమైన దయతో తమని ఆలూమగలుగానే గుర్తించి ఉదయమే విడిచిపెట్టేశారు. లేకుంటేనా తమ పరువు ఊళ్ళో అందరికీ తెలిసిపోయేది.

అప్పటినుంచి ఎంత కొంపలంటుకునే పని ఉన్నాసరే రాత్రి పదిగంటలకి ఒక్క నిమిషం ఎక్కువయినా బయట కాలుపెట్టేవాడు కాదు రామలింగం.

అల్లంత దూరంలో ఏదో వాహనం వస్తోంది. దాని హెడ్‌లైట్ల తాలూకు వెలుతురు సూటిగా రామలింగం కళ్ళలో దూరి ఇబ్బంది పెట్టేసింది. ఆ వెలుతురు వేపు చూడకుండా తల వంచుకుని నడుస్తున్నాడు. కొంపదీసి అది పోలీసు వ్యాను కాదు కదా!

అలా అనుకోగానే అంత చలిలోనూ, అతని అరిచేతుల్లోను, అరికాళ్ళలోను, మొహంలోనూ చెమట పట్టేసింది. అది పోలీసు వ్యానే అయి వుంటుంది... తనని చూడగానే నిలబెట్టేస్తారు...యక్షప్రశ్నలూ, లక్షతిట్లూ కురిపిస్తారు.

ఏమైనా సరే తను భయపడకూడదు....ఈ సారి ఎన్ని ప్రశ్నలకైనా తడబడకుండా జవాబు చెప్పాలి తను. తనేమైనా క్రిమినలా? పోలీసుల బెదిరింపులకు అదిరిపోవడానికి! తన సొంత ఊరి నించి వస్తున్నాడు. అదే విషయం గట్టిగా నిర్భయంగా చెబుతానంతే! ...అవునూ....అలా చెబితే - ఉత్తుత్తినే నమ్మేస్తే వాళ్ళెలా పోలీసులవుతారు. అందుకు ఎవిడెన్సు ఏదని అంటారు? తనెక్కడినుంచి తేగలడు ఎవిడెన్సు? తను ప్రయాణం చేసింది లారీలో కదా! బస్సయితే టిక్కెట్టుండేది.... ఇప్పుడెలా? అనుకుంటూ ఉంటే అతని కాళ్ళలో సన్నటి వణుకు ప్రారంభమయింది.

ఈలోగా వ్యాను మరీ దగ్గరయింది.

అతని గుండె మరీ దడదడలాడి పోయింది.

అయితే - అదృష్టం!! అది ఆగలేదు. - బహుశా అది పోలీసువ్యాను కాదేమో!

'థ్యాంక్ గాడ్! అనుకున్న ప్రమాదం ఎదురు కాలేదు.'

'ఈ ప్రభుత్వం వాళ్ళు అర్ధరాత్రి వేళనయినా ఆడది ఒంటరిగా నిర్భయంగా తిరగగల వ్యవస్థని నెలకొల్పుతామని ఓ వేపు అంటూనే - ఇంకోవేపు మీసమున్న మగవెధవ కూడా అర్ధరాత్రిళ్ళు గుండెల్ని అరచేతిలో పెట్టుకుని భయంభయంగా తిరిగే అవస్థ తెచ్చిపెట్టారు' అనుకుని నిట్టూర్చాడు రామలింగం.

మొన్నటికి మొన్న తన ఇంటి పక్కనున్న కనకయ్య అతని భార్యని పురిటికోసం ఆసుపత్రిలో చేర్పించేందుకు అర్ధరాత్రివేళ రిక్షాకోసం తిరిగాడు బజార్లు పట్టుకుని. రిక్షా కనపడలేదు. పోలీసు జీపు కనబడింది. కనకయ్యని అనుమానించి పట్టుకెళ్ళారు. అతను ఎంత మొత్తుకుని నిజం చెప్పినా వినలేదు. ప్రొద్దుటి వరకు స్టేషనులో కూచో పెట్టి వదిలేశారు. అలాగే కనకయ్య భార్యకు పురిటినొప్పులు ఎక్కువై, కానుపు అవడం కష్టం కావడంతో ఆవిడ చనిపోయింది.

నిజానికి పోలీసులు కనబడితే ప్రాణం లేచివచ్చి తనకి కొండంత ధైర్యం రావాల్సింది. కానీ పోలీసులు ఎక్కడ కనపడతారోనని మనసు విపరీతమైన వేదన పడటం వింతగా అనిపించింది. ఒక రకం బాధతో కూడిన నవ్వు పెదాలమీదికి తన్నుకు వచ్చింది రామలింగానికి.

నవ్వుని పెదాలతో అదిమిపెట్టేసి వడివడిగా అడుగులు వేస్తున్నాడు రామలింగం.

"ఏయ్! ఆగు!' అంటూ ఓ కరుకైన కంఠం చీకట్లోంచి మెరుపులేని ఉరుములా దూసుకు వచ్చింది కొంచెం దూరం నుంచి.

ఒక్కక్షణం తటపటాయించి మళ్ళీ అడుగులు వేయబోయాడు రామలింగం.

"ఏయ్...నిన్నే ఆగు! వినబడ్డం లేదా?" అంటూ మళ్ళీ ఉరుము వచ్చేటప్పటికి రామలింగం చేష్టలుడిగి నిలుచుండిపోయాడు.

రామలింగానికి చేష్టలయితే ఉడిగాయి కానీ, మెదడు మాత్రం మరీ చైతన్యవంతమై పోయి ఆలోచిస్తోంది.

అది పోలీసు కంఠమే. అంత కర్కశంగా, గరుగ్గా, నిర్దాక్షిణ్యంగా,మరీ సంస్కార రహితంగా ఉందంటే అది నిస్సందేహంగా పోలీసు కంఠమే! ఇంకేముంది? తన పని గోవిందా. సవాలక్ష యక్షప్రశ్నలకి తను జవాబులు చెప్పాలి. అది వీలయ్యే పనేనా...ఒకవేళ సమాధానం చెప్పినా, చెప్పకున్నా పర్యవసానం కటకటాలు చూడటమే! ఇక ఈ రాత్రంతా దిగులుతో, అవమానంతో, బతుకుమీద విరక్తితో పోలీస్‌స్టేషన్‌లో గడపాల్సిందేనా...దేవుడు మేలుచేసి ఏ కేసూ పెట్టకుంటే ఫర్వాలేదు. లేదంటే ఏ నేరంలోనో ఇరికించేసి, ఏ క్రూరమైన కేసు తన పైన మోపినా ఏం చేయగల్డు తను!

'భగవంతుడా!...ఎక్కడున్నావయ్యా కలడందురు దీనులయెడ...మరి నేను దీనుడను కానా? ఏమిటి నాకీ అగ్నిపరీక్ష...ఏల నాకీ పోలీసు పరీక్ష!"

అవతలి ఆకారం దగ్గరవుతున్నట్టుగా పాదరక్షల శబ్దం తెలుపుతోంది. ఆ ఆకారం రంగు కూడా నలుపేమో కటిక చీకట్లో అసలు కనిపించడంలేదు.

"ఎవర్నువ్వు?" ఆకారం గర్జించింది.

"నే...నే...నే నేను లి...లి...లింగాన్నిసార్!" నోరు తడారి పోతూండగా ఎలాగో మాట్లాడ గలిగాడు రామలింగం.

"ఏ గుళ్ళో లింగానివి?" మళ్ళీ గర్జన.

"ఏఏ...గుళ్ళో కాదండీ... మా అమ్మానాన్నలు పె..పెట్టిన పేరు లింగం సార్... పూ....పూర్తి పేరు రామలింగం సార్!"

"సరే... ఏదో బోడిలింగం..ఏమిటీ...ఈ వేళప్పుడు?'

"ఇంటికి వెళ్తున్నాను సార్!"

"ఇంటికి కాక వల్లకాటికి పోతావనుకున్నానా బేవకూఫ్! ఎక్కడ పనిచేస్తున్నావ్?"

చెప్పాడు రామలింగం.

"ఎక్కడినుంచి వస్తున్నావ్? ఇంత రాత్రివేళ ఇలా వంటరిగా వస్తున్నావూ అంటే...నీదేమైనా రాత్రి వ్యాపారమా?"

"లేదు...లేదు సార్! నేను నేను గవర్నమెంటు ఉద్యోగినని చెప్పానుగా..."

"సర్లేవోయ్! గవర్నమెంటు ఆఫీసుల్లో బోల్డంతమంది స్మగ్లర్లని చూశానుగానీ, ఆ సూట్‌కేసులో ఏముందీ...బంగారు బిస్కట్లా.. హిరాయినా.. గంజాయా.. బ్రౌన్ షుగరా?"

"అవేమీ కాదు సార్!" అన్నాడు రామలింగం. అప్పటికి కాస్త ధైర్యం వచ్చింది. అతనడిగినవి తన సూట్‌కేస్‌లో లేవని తెలిస్తే తనని వదిలేస్తాడని రామలింగానికి ఎక్కడో ఆశ చిగురించింది.

"మరైతే ఏమున్నాయందులో?"

"ఒక జతబట్టలున్నాయి సార్! కావాలంటే చూపిస్తాను సార్!"

"యూ..యూజ్‌లెస్ ఫెలో...మరి ఆ మాత్రానికే ఎందుకలా భయపడి వణికి పోతున్నావ్?"

"అబ్బే - నేనా సార్...లేద్సార్" అన్నాడు రామలింగం - చీకట్లోనే నవ్వాలని ప్రయత్నిస్తూ.

"నువ్వెంత వణికిపోతున్నావో నీ మాటలే చెబుతున్నాయి".

"మరి పోలీసులంటే నాకు చిన్నప్పటి నుంచి భయం సార్! అందువల్ల..."

"నువ్వేం భయపడకు... నేను పోలీసోణ్ణి గాదు" అందా ఆకారం. చీకట్లో అతని నవ్వు రామలింగానికి వినిపించింది.

"మరి ఎవరు సార్ మీరూ?" ధైర్యంగా అడిగాడు.

"అదంతా నీకనవసరం...ముందు సూట్‌కేసు ఇలా ఇవ్వు?!!"

నివ్వెరపోయాడు రామలింగం!.

అర్థమయింది సార్.. మీరు...మీరు.. దొంగగారా సార్.. హమ్మయ్య! బతికించారు సార్! నిజంగా మీరు దొంగే అయితే నాది ఎంత అదృష్టం సార్!" అన్నాడు రామలింగం ఆనందంపట్టలేక.. అతను పోలీసు కానందుకు గట్టిగా కౌగలించు కుందామని ఉంది. దొంగగారు ఇష్టపడతారో లేదోనని మానుకున్నాడు రామలింగం.

"అధిక ప్రసంగం చాలు" అంటూనే సూట్‌కేసు లాక్కున్నారు దొంగగారు.

"అధిక ప్రసంగం కాదు దొంగగారూ! ఆనందంతో చేసే ప్రసంగమిది...మీకు కావాలంటే నా వాచీ కూడా ఇచ్చేస్తున్నా తీసుకోండి సార్ - మహదానందంగా".

రామలింగం వాచీనీ అందించగానే వాచీ సూట్‌కేస్‌లతో మాయమైపోయారు దొంగగారు.

"అమ్మయ్య...పోలీసోళ్ళు కాదు" అని సంతోషించి ఆనందంగా ఈలవేస్తూ ఇంటి దిశగా అడుగులు ఉత్సాహంగా వేస్తూ సాగిపోయాడు రామలింగం - పోయిన వస్తువుల్ని గురించి కించిత్ బాధకూడా లేకుండా!

(విపుల - సెప్టెంబరు, 1989)